సాక్షి
బాపట్ల
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



కార్మెల్‌మాతను దర్శించుకున్న భక్తులు

ఫిరంగిపురం: కార్మెల్ మాతను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పెద్దఎత్తున వచ్చారు. కర్నూలు, జమ్మలమడుగు, నంద్యాల, ధర్మవరం ప్రాంతాల నుంచి తరలివచ్చారు.



సబ్‌జైలును తనిఖీ చేసిన న్యాయమూర్తి

గురజాల : సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు ఆదివారం తనిఖీ చేశారు. ఆయన వెంట న్యాయవాది కలివెల ప్రభుదాసు, జైలు సూపరింటెండెంట్ సీహెచ్ సుబ్బారెడ్డి ఉన్నారు.

బండ్లమ్మకు పూజలు



చందోలు(పిట్లలవానిపాలెం): మండలంలోని చందోలులో గల శ్రీ బగళాముఖ బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నేడు పొన్నూరుకు సీఎం వైఎస్ జగన్



పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం పొన్నూరుకు రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగిస్తారు. పర్యటన ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పరిశీలించారు. మధ్యాహ్నం 3 గంటలకు అంబేడ్కర్ సెంటర్‌లో బహిరంగ సభ జరిగే ప్రదేశం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అధికారులు, నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాల్గొనే బహిరంగ సభకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ పర్యటనలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. భద్రతా ఏర్పాట్లను ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు రమేష్, పోతురాజు, శాంతకుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ రూత్ రాణి, నాయకులు షేక్ నాజర్, వడ్రాణం ప్రసాద్, దాసరి నారాయణరావు, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.5 లక్షల విరాళం




నరసరావుపేటరూరల్: ఇస్సపాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఇరుకుపాలెం గ్రామానికి చెందిన వెంపాటి శ్రీనివాసరావు, రమాదేవి, వెంకట లింగేశ్వరరావు, కిరణ్మయి దంపతులు రూ.2,50,000 విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళం చెక్కును ఈఓ టి.సుధాకరరెడ్డికి దాతలు అందించారు. ఆలయ పునర్నిర్మాణం వేగంగా జరుగుతుందని, దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ కోరారు.

మసీదుల్లో టీడీపీ ప్రచారంపై లీగల్ సెల్ ఫిర్యాదు



నరసరావుపేట: మసీదుల్లో కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు కోరారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి, డీఆర్వో కె.వినాయకంకు ఫిర్యాదు అందజేశారు. టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు కొంతమంది కార్యకర్తలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన చేస్తూ నియోజకవర్గంలో ఉన్న మసీదుల్లో పాంప్లెట్లు, బుక్స్ పంచుతూ టీడీపీకి ఓటు వేయమని ప్రలోభ పెడుతూ ప్రచారం చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోమని ఆధారాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాకుమాను బాల హనుమంతరెడ్డి, ఆరెకూటి శ్రీనివాసరెడ్డి, యర్రంరెడ్డి సీతారామరెడ్డి, ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 505.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 808.30 అడుగుల వద్ద ఉంది.







ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికల సమరంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. అద్దంకి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ఆదివారం మండలంలోని ఉప్పలపాడులో ప్రచారం చేశారు. గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్ సీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేష్ ఆదివారం రాత్రి చీరాల రూరల్ మండలం కావూరివారిపాలెం, వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం గ్రామాల్లో ప్రచారం చేశారు. కూటమి కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు చెప్పారు. చుండూరు మండలంలోని మండూరు, చినగాదెలవర్రు, పెదగాదెలవర్రు, కారుమూరి వారి పాలెం గ్రామాల్లో వేమూరు అసెంబ్లీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

జయమ్ము.. నిశ్చయమ్మురా !

- రేపల్లె, చీరాలల్లో హవా
- అద్దంకి, పర్చూరులలోనూ ఇదే పరిస్థితి
- మళ్లీ వైఎస్.జగన్ పాలన కోరుకుంటున్న జనం
- వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడకేనంటున్న పరిశీలకులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనపై ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా లబ్ధి పొందారు. జగన్ పాలనపై సానుకూలత వ్యక్తమవుతోందని, తిరిగి ఆయన్ను అధికారంలోకి సంసిద్ధంగా ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో గత ఎన్నికల్లో అధికార పార్టీ గెలిచిన స్థానాలతో పాటు పచ్చపార్టీ గెలిచిన స్థానాల్లోనూ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయం ఖాయంగా కనిపిస్తోందన్నది పేర్కొంటున్నారు. అధికారపార్టీ అన్ని స్థానాల్లోనూ విజయదుందుభి మోగించనుందని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎన్నికల వాతావరణం కూడా దీన్నే ప్రతిబింబిస్తోంది.

అద్దంకిలో వైఎస్సార్ సీపీ హవా



అద్దంకి నియోజకవర్గం



పానెం చిన హనిమిరెడ్డి

2014 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గెలుపొందిన గొట్టిపాటి రవికుమార్ ఆ తర్వాత చంద్రబాబు ప్రలోభాలతో పచ్చపార్టీలోకి వెళ్లారు. గత ఎన్నికల్లో ఆయన వైఎస్సార్ సీపీ అభ్యర్థి బాచిన చెంచు గరటయ్యపై 12,991 ఓట్ల మెజార్టీతో గెలుపొందినా.. ఇప్పటివరకూ జరిగిన 14 ఎన్నికలను పరిశీలిస్తే ఇక్కడ సగటున 4 వేలకు మించి మెజార్టీ రాలేదు. ఈ నియోజకవర్గంలో కమ్మ సామాజిక వర్గం ఓట్లు 47 వేలు ఉన్నాయి. డబ్బు ఎరవేసి రెడ్డి, యాదవ, ఎస్సీ ఓట్లలో చీలిక తెచ్చి గొట్టిపాటి గత ఎన్నికల్లో నెగ్గారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ మొదటిసారి 17 వేల పైచిలుకు ఓట్లున్న రెడ్డి సామాజికవర్గానికి చెందిన పానెం చిన్న హనిమిరెడ్డిని అభ్యర్థిగా నిలిపింది. దీనికితోడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల జనరంజక పాలనలో నియోజకవర్గంలో అధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు పెద్దఎత్తున లబ్ధి పొందారు.వీరంతా ఈ ఎన్నికల్లో అధికారపార్టీ అభ్యర్థికి మద్దతుగా నిలువనున్నారు. పై పెచ్చు గొట్టిపాటిపై సొంత పార్టీలో అసంతృప్తులు అధికారపార్టీ అభ్యర్థికి కలిసి రానున్నాయి. మొత్తంగా ఈసారి అద్దంకిలో అధికార పార్టీ.. పచ్చపార్టీ అభ్యర్థికి చెక్ పెట్టబోతోంది.

పర్చూరులో దొంగ ఓట్లకు చెక్



పర్చూరు నియోజకవర్గం



యడం బాలాజీ

పర్చూరు నియోజకవర్గంలో గత రెండు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలుపొందారు. 2014లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గొట్టిపాటి భరత్, 2019లో దగ్గుబాటి వెంకటేశ్వరరావు పై ఆయన గెలుపొందారు. అయితే, ఇక్కడ ఏ నాడూ టీడీపీకి పెద్దగా మెజార్టీ వచ్చిన దాఖలాలు లేవు. అధికంగా ఉన్న దొంగ ఓట్లవల్లే అభ్యర్థి గెలుపొందారన్న ప్రచారం ఉంది. ఇప్పటివరకూ పర్చూరు అసెంబ్లీకి 15 సార్లు ఎన్నికలు జరగ్గా 1967, 1991, 2004, 2014 ఎన్నికల్లో మాత్రమే మెజార్టీ 10 వేలు దాటింది. మిగిలిన అన్నిసార్లు సగటున మూడు వేలకు మించి రాకపోవడం గమనార్హం . ఇటీవల అధికారులు నియోజకవర్గంలో దాదాపు 14 వేల దొంగ ఓట్లను తొలగించారు. వీటిలో 90 శాతం టీడీపీ సానుకూల ఓట్లని తెలుస్తోంది. పర్చూరులో అత్యధికంగా ఉన్న కమ్మ సామాజికవర్గంతో పాటు మిగిలిన బీసీ వర్గాల్లో చీలిక తెచ్చి గత ఎన్నికల్లో టీడీపీ గెలుపొందింది. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ మొదటిసారి కాపు సామాజికవర్గానికి చెందిన ఎడం బాలాజీని అభ్య ర్థిగా నిలిపింది. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన నేపథ్యంలో ఈ ఎన్నికల్లో కాపు సామాజికవర్గంతో పాటు ఎస్సీ, ఓసీ, బీసీ, సామాజికవర్గాల ఓట్లు అధికారపార్టీ అభ్యర్థికి పడనున్నాయి.

రేపల్లెలో అధికార పార్టీ గెలుపుబాట



రేపల్లె నియోజకవర్గం



ఈవూరి గణేష్

రేపల్లె నియోజకవర్గంలో గత రెండు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మోపిదేవి వెంకటరమణపై వరుసగా గెలుపొందారు. నియోజకవర్గంలో అత్యధికంగా 42 వేల గౌడ సామాజిక వర్గం ఓట్లు ఉన్నాయి. టీడీపీ అభ్యర్థి అనగాని ఆ వర్గానికి చెందినవారు కావడంతో దాదాపుగా ఓట్లు ఆయనకే పడేవి. వీటితో పాటు కొన్ని బీసీ వర్గాల ఓట్లు కొంతమేర చీల్చుకోవడంతో ఆయన గెలుపొందారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వ్యూహాన్ని మార్చింది. గౌడ అభ్యర్థి ఈవూరి గణేశ్‌ను పోటీకి దింపింది. దీంతో ఆ సామాజికవర్గంలో ఓట్లు చీలనున్నాయి. వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన ఎన్నికల్లో ఆ పార్టీకి దన్నుగా నిలవనుంది. దాదాపు 40 వేలు ఉన్న ఎస్సీ సామాజికవర్గం ఓట్లతో పాటు మిగిలిన ఓసీ, బీసీ వర్గాల ఓట్లు అధికార పార్టీకి గంపగుత్తగా పడనున్నాయి. దీంతో ఈ ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈవూరి గణేశ్ గెలుపు నల్లేరుపై నడకేనన్నది పరిశీలకుల అంచనా.

పచ్చ స్థానంలో అధికార పార్టీ పాగా



కరణం వెంకటేష్



చీరాల నియోజకవర్గం

గత ఎన్నికల్లో టీడీపీ నెగ్గిన అసెంబ్లీ స్థానాల్ని సైతం ఈ ఎన్నికల్లో అధికార వైఎస్సార్ సీపీ గెలుపొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో చీరాల అసెంబ్లీ నుంచి అప్పటి టీడీపీ అభ్యర్థి కరణం బలరామకృష్ణమూర్తి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌పై 17,419 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో కొన్ని బీసీ సామాజిక వర్గాల ఓటు బ్యాంకుతోపాటు బలరామకృష్ణమూర్తి వ్యక్తిగత చరిష్మా ఆయన విజయానికి దోహదపడింది. ఎన్నికల తర్వాత బలరామకృష్ణమూర్తి అధికార పార్టీలో చేరారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన కుమారుడు కరణం వెంకటేశ్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీకి దిగారు. టీడీపీ అభ్యర్థిగా ఎంఎం కొండయ్య, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్ బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో మారిన పరిస్థితులు, వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల ప్రజారంజక పాలన, బలరాం చరిష్మా, కరణం వెంకటేశ్ నిత్యం జనంలో ఉండటం ఆయన గెలుపునకు దోహదం చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు గతంలో టీడీపీ వైపును బీసీలు కూడా నేడు అధికారపార్టీకి మద్దతు పలుకుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆమంచి కృష్ణమోహన్ టీడీపీకి పడే కొన్ని వర్గాల ఓట్లను చీల్చే అవకాశముంది.

మేనిఫెస్టోలో అన్ని వర్గాలకు సమ న్యాయం

- వైఎస్సార్ సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్
- ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబుతో కలసి ప్రచారం
- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థన



ప్రచారంలో ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు

ఐలవరం(భట్టిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని వైఎస్సార్ సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా భట్టిప్రోలు మండలం ఐలవరంలో ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబుతో కలసి ఆదివారం ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లల్లో చేపట్టిన సంక్షేమ పథకాలు... సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట కోసం ఏవిధంగా నిలబడతారో వివరిస్తూ ముందుకు సాగారు. ఐలవరంతో పాటు భట్టిప్రోలు దళితవాడలో ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మహిళలు హారతులు పట్టారు. దారిపొడవునా అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు జై జగన్, జై సురేష్, జైజై అశోక్‌బాబు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నందిగం సురేష్ మాట్లాడుతూ తమ నాయకుడు ఇచ్చిన మాట మీద నిలబడతాడని, మేనిఫెస్టోను భగవద్గీత, బైబుల్, ఖురాన్‌గా భావించి పక్కాగా అమలు చేస్తారని తెలిపారు.మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేస్తారని, పేద, బడుగు, బలహీనవర్గాలతో పాటు అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి సురేష్, ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో అనుభవ నరేంద్ర చేరారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కొండా శివప్రసాదరెడ్డి , సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందర రావు, ఉప సర్పంచ్ కర్రా జయశ్రీ , వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ చిలుమూరు రామమోహన్ రావు, పడమట శ్రీనివాసరావు, ఎం. తులసీ రంగయ్య, గట్టు శ్రీనివాసరావు, మాచర్ల వీరేంద్ర, కర్రా కిశోర్, జొన్నాదుల శరత్‌బాబు, మాచర్ల శంకర్, గోవర్ధనగిరి పెదబుజ్జి, సిరాజుద్దీన్, చిలుమూరు ప్రశాంత్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలకు పటిష్ట భద్రత

- ఎన్నికల పరిశీలకులు పరిమళ్ సింగ్
- భట్టిప్రోలులో స్ట్రాంగ్ రూం, వెల్లటూరులో పోలింగ్ కేంద్రాల పరిశీలన
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని అధికారులకు సూచన



భట్టిప్రోలులో అధికారులకు సూచనలు చేస్తున్న పరిమళ్ సింగ్

భట్టిప్రోలు: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు స్ట్రాంగ్ రూంల భద్రత, ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ అంశాల్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేసుకోవాలని పరిశీలకులు పరిమళ్ సింగ్ తెలిపారు. భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు పరిమళ్ సింగ్ మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలు పటిష్టంగా ఉండాలని అధికారులకు సూచించారు. అక్కడ నుంచి వాటిని కౌంటింగ్ కేంద్రాలకు తరలించే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. స్ట్రాంగ్ రూం పరిసరాల్లో గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే అదుపులో ఉంచడానికి ఫైర్ వాహనాన్ని అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు, సిబ్బంది సహకారంతో బాధ్యతాయుతంగా పని చేయాలని పరిమళ్ సింగ్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలపై అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. వెల్లటూరులోని 230, 232 పోలింగ్ కేంద్రాల్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ వసంతరాయుడు, తహసీల్దార్ ఐ. మునిలక్ష్మి, రేపల్లె డీఎస్పీ టి. మురళీకృష్ణ, వేమూరు సీఐ డి. రామకృష్ణ, భట్టిప్రోలు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన బాపట్ల జిల్లా ఎడ్ల జతలు

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లెలో గణపతి, పోలేరమ్మ, అంకాలమ్మ, వీరభద్ర, నాగులమ్మ, నందీశ్వర, ప్రసన్నాంజనేయస్వామి, కాశీవిశ్వనాథ, మారెమ్మ, పోతురాజు, నాభి శిల, లక్ష్మీజగన్నాథ స్వామి, ధ్వజ, శిఖర, కుంభాభిషేకం, ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఏడు జతలు పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం గుంపులమానిదిన్నె గ్రామానికి చెందిన కుందురు భూపాల్‌రెడ్డికి చెందిన ఎడ్లు నిర్ణీత 20 నిమిషాల్లో వెయ్యి అడుగులు లాగి మొదటి బహుమతి, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పి.వీరయ్యస్వామి చౌదరి ఎడ్లు 564 అడుగులు లాగి రెండో బహుమతిని సాధించాయి. రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామానికి చెందిన బొర్ర రవితేజ ఎడ్ల జతలు 512 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.80 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు ధర్మకర్త మూడుగుళ్ల వెంకటరామిరెడ్డి, చైర్మన్ శీలం వెంగళరెడ్డి, భూపని వెంకటేశ్వర్లు, మాజీ సైనికుడు రంగయ్య చేతులు మీదుగా అందజేశారు.

లార్డ్స్ గ్రేస్ చర్చిని సందర్శించిన మంత్రి మేరుగ నాగార్జున




కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని లార్డ్స్ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చికి ఆంధ్రప్రదేశ్ మంత్రి మేరుగ నాగార్జున ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన చర్చికి వచ్చిన వారికి సందేశం అందించారు. పలువురితో ముచ్చటించారు. అనంతరం తేనీటి విందులో పాల్గొన్నారు. మంత్రితో పాటు చర్చి ఫాదర్ జార్జి హెర్బెట్, మేకల మైకేల్ ఉన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై వేసవి రద్దీ కనిపిస్తోంది. రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు వేసవి సెలవులు ప్రకటించడంతో పాటు ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడంతో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు.

మద్యం, నగదు పంపిణీపై గట్టి నిఘా

అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్ బాషా

బాపట్ల: అభ్యర్థుల ఎన్నికల ప్రచారం కీలక దశలో ఉన్న నేపథ్యంలో మద్యం, నగదు పంపిణీలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. ఆదివారం తన కార్యాలయంలో అక్రమంగా మద్యం రవాణా, విక్రయాలు తదితర విషయాలపై పోలీస్, ఎక్సైజ్, సెబ్, ఎన్నికల వ్యయ పరిశీలన అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆదివారం వరకు 2450 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ. 28.45 లక్షల విలువైన 22,886 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామని వివరించారు. ఎన్నికల్లో మద్యం సరఫరాను అరికట్టడానికి అక్రమ డంప్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మద్యం షాపుల విక్రయాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, జిల్లా ఆడిట్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా తెలిపారు. ఆదివారం చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ల ఉప సంహరణకు చివరి తేదీ ఈనెల 29 అని వెల్లడించారు.మే 13న పోలింగ్ రోజు ఉదయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4, ఎన్నికల కోడ్ ముగిసే తేదీ జూన్6 అని తెలిపారు. ప్రజలు సమస్యల పరిష్కారం, ఫిర్యాదుల కోసం మీడియా మానిటరింగ్ (మీడియా సెంటర్, సోషల్ మీడియా సెల్): 08643-297808, వెబ్ కాస్టింగ్: 08643-297811, సీ-విజిల్ : 08643-297804, 1950 కాల్ సెంటర్ : 08643-297802, హెల్ప్ డెస్క్: 08643-29 7812ను సంప్రదించాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ఒకటో తేదీ వరకు అవకాశం

బాపట్ల: ఎన్నికల్లో విధులు నిర్వహించే వారి నుంచి ఫారం-12(పోస్టల్ బ్యాలెట్) దరఖాస్తుల స్వీకరణ మే 1 వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా తెలిపారు. దరఖాస్తుదారులు పని చేస్తున్న జిల్లాలో ఓటుహక్కు కలిగి ఉండాలని, దాన్ని వినియోగించుకోవడానికి ప్రతి నియోజకవర్గంలో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మే 5న పోలింగ్ అధికారులు, మే 6న ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

జిల్లాలో ఫెసిలిటేషన్ కేంద్రాలు

వేమూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రేపల్లెలో క్రిస్టియన్ కళాశాల, బాపట్లలో మునిసిపల్ హైస్కూల్, యాదవపాలెం, సత్యనారాయణపురం, పర్చూరులో నాగులపాలెంలోని యస్.యఫ్.ఎస్ హైస్కూల్, అద్దంకిలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ పక్కనున్న ప్రకాశం గవర్నమెంట్ జూనియర్ కాలేజీ , చీరాలలో మున్సిపల్ కార్యాలయం దగ్గరున్న యార్లగడ్డ అక్కమాంబ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసులు, తప్పనిసరి సేవల విభాగాల ఉద్యోగులు, డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు ఇతర ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారంతా తమ ఓటున్న నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ, ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉన్న వారంతా మే 7న బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో వినియోగించుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

ఆర్మీ జవాను మృతి

ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ..

పిట్టలవానిపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ ఆర్మీ జవాను మృతి చెందారు.వివరాలిలా ఉన్నాయి. గోకరాజునల్లి బోయినవారిపాలెం గ్రామానికి చెందిన దొంతిబోయిన నాగరాజు (42) ఢిల్లీలో ఆర్మీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 25న రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై అలకాపురం వైపు నుంచి స్వగ్రామానికి వస్తుండగా వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 26 తెల్లవారు జామున నాగరాజు మృతి చెందినట్లు చందోలు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఆర్మీ జవాను నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు నిఖిల్ నాగరాజు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కోడూరు: కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చోడాయపాలేనికి చెందిన నక్కా వెంకటేశ్వరరావు(50) కుటుంబ సభ్యులతో కలిసి నాగాయలంక మండలం దీన దయాల్ పురంలో ఉంటున్నాడు. ఓ కార్యక్రమం నిమిత్తం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం మండలంలోని దింటిమెరక సమీపంలోని కాలువ గట్టుపై ఉంటున్న బంధువుల ఇళ్లకు వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం వెంకటేశ్వర రావు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడంతో కుటుంబీకులు విషయాన్ని పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. మృతుని కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఘటనాస్థలాన్ని అవనిగడ్డ సీఐ శ్రీనాథ్ పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..బాపట్ల జిల్లా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన దాసరి శివ(35) దినసరి కూలీ. ఈ నెల 23న , కుటుంబ సభ్యులతో శివ గొడవ పడి విజయవాడకు వచ్చాడు. వారధి సమీపంలోని సాయిబాబా గుడి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాది ప్రజల మేనిఫెస్టో

- సూపర్ సిక్స్ పథకాలు పెద్ద మోసం
- టీడీపీ, కాంగ్రెస్‌లది లోపాయకారీ ఒప్పందం
- మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేశ్

చీరాల అర్బన్: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ప్రజల మేనిఫెస్టో అని, పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని వైఎస్సార్ సీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేశ్ అన్నారు. ఆదివారం సాయంత్రం రామకృష్ణాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో ప్రజారంజకంగా ఉందన్నారు. పింఛన్లు, అమ్మఒడి, రైతు భరోసాతో పాటు నిరుద్యోగుల స్కిల్ హబ్‌లు, క్రీడల పట్ల పార్టీ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తమ ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని ఎద్దేవా చేసిన ప్రతిపక్షం, చివరకు అవే పథకాలకు పేర్లు మార్చి తమ మేనిఫెస్టోలో పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల పక్షాన నిలబడిన పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు.

చీరాలను చేనేత క్లస్టర్ గా తీర్చిదిద్దుతాం..

చీరాలను చేనేత క్లస్టర్‌గా తీర్చిదిద్దుతామని, అలాగే తీర ప్రాంత అభివృద్ధిలో భాగంగా చీరాల ఓడరేవు తీరంలో ఫిషింగ్ హార్బర్‌ను ప్రభుత్వం ఏర్పాటు కాగానే పూర్తి చేస్తామని కరణం వెంకటేశ్ తెలిపారు. పథకాలు పొందిన ప్రజలే వైఎస్సార్ పార్టీ ప్రచారకర్తలుగా వ్యవహరించడం గొప్ప విషయమన్నారు. చీరాల నియోజకవర్గంలో గెలిచేది వంద శాతం వైఎస్సార్ సీపీనేనని ధీమా వ్యక్తం చేశారు.

లోపాయకారిగా టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు..

ఈ ఎన్నికలలో విచిత్ర పరిస్థితులు నెలకొని ఉన్నాయని, కాంగ్రెస్, టీడీపీ నేతలు లోపాయకారీ ఒప్పందంతో పనిచేస్తున్నారన్నారు. చీరాలలో త్రిముఖ పోటీ నెలకొందన్నారు. చీరాలలో తన విజయం కోసం, ప్రజల గెలుపునకై ఆలోచిస్తానన్నారు. ప్రతిపక్షాలు వారి విజయం కోసం కాకుండా తన ఓటమికై ఆలోచిస్తున్నారని కరణం విమర్శించారు. చీరాలలో గతంలో ఉన్న పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఎన్నికల బరిలో దిగామన్నారు. చీరాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. రాష్ట్ర విభజనకు కారణమైన కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని మాజీ ఎమ్మెల్యే ప్రజల ముందుకు వచ్చారన్నారు. రాష్ట్ర వినాశనానికి కారణమైన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సహకరించే పరిస్థితి లేదన్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని, ఎన్నికలకు మేము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహిస్తూ అందరి మద్దతు పొందుతున్నామని కరణం వెంకటేశ్ తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ వేటపాలెం మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, పార్టీ పట్టణ-2 అధ్యక్షులు గుంటూరు మాధవరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనకు జనం ఆకర్షితులవుతున్నారు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలనతో ప్రజలు ఆకర్షితులై వైఎస్సార్ సీపీకి అసాధారణ గౌరవ మర్యాదలు అందిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చెరుకుపల్లి మండలం గూడవల్లికి చెందిన పలువురు మైనారిటీ ప్రతినిధులు ఆదివారం వైఎస్సార్ సీపీ బాటపట్టారు. ఈ సందర్భంగా రేపల్లె పట్టణంలో ఎంపీ మోపిదేవి తన కార్యాలయంలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నిలబడే జగనన్నపై నమ్మకంతో అనేక మంది పార్టీలోకి వస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం అవుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గూడవల్లికి చెందిన అబ్దుల్ వహాబ్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు షేక్ హుస్సేన్, షేక్ మహబూబ్ సుభాని, షేక్ కరీముల్లా, షేక్ మీరావాలి, షేక్ సుభాని, షేక్ హుస్సేన్ బీర్, షేక్ కమల్ భాష, షేక్ మౌలాలిలతో పాటు మరికొన్ని కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి.

రాజన్న రాజ్యం కోసం మళ్లీ ఓటేయండి

- జోరుగా అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి ఎన్నికల ప్రచారం
- ఫ్యాన్ కే ఓటేస్తామన్న ఉప్పలపాడు గ్రామస్తులు



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి



ఆప్యాయంగా ఎదురేగి స్వాగత పలుకుతూ హారతులిస్తున్న స్థానిక మహిళలు

అద్దంకి: రాజన్న రాజ్యం కోసం త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని అద్దంకి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం మండలంలోని ఉప్పలపాడులో ప్రచారం నిర్వహించారు. ప్రచార నిమిత్తం వచ్చిన హనిమిరెడ్డికి గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. మహిళలు, వృద్ధులు, యువత మీ వెంట మేమున్నామంటూ నడిచారు. మీదే విజయం అంటూ పెద్దలు ఆశీర్వదించారు. ఈసందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ అద్దంకి తనను సొంత బిడ్డలా ఆదరిస్తోందన్నారు. ప్రజల ఆప్యాయతానురాగాలు మరింత బలాన్నిస్తున్నాయన్నారు. అభిమానంతో ఉన్న ఓటర్లను ఎవరూ ఆపలేరని, నాయకులు పార్టీ మారినా ఓటర్లు వైఎస్సార్ సీపీవైపే ఉన్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి నాయకుడు కార్యకర్త ఓటర్లను చైతన్యవంతం చేసేలా ముందుకు వెళ్లాలన్నారు. ఓట్లన్నీ ఈవీఎంలలోకి చేరేవరకు నిద్రపోవద్దన్నారు.

గెలిచాకా మీ మధ్యలోనే ఉంటా..

ఎన్నికల నేపథ్యంలో అవిశ్రాంతంగా ప్రచారం చేస్తున్నా. గెలిచిన తరువాత కూడా మీ అందరికీ అందుబాటులో ఉంటా. గడప గడపకు వెళ్లి మీ బాగోగులు తెలుసుకుంటా. సమస్యలుంటే పరిష్కారానికి తక్షణమే చొరవ చూపుతా. ఇబ్బందులుంటే నేరుగా ఫోన్ చేయండి. అండగా నిలబడతానంటూ చిన హనిమిరెడ్డి ప్రజలనుద్దేశించి వ్యాఖ్యానించారు. ఇకపై తన జీవితం ప్రజా సేవకే నిర్ణయించుకున్నానన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఒక ఓటు తనకు, మరో ఓటు ఎంపీ అభ్యర్థి నందిగం సురేశ్ కు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు,, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారంజకంగా మేనిఫెస్టో

- ఐదేళ్లలో బంగారు బాపట్లగా తీర్చిదిద్దుతా
- చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ అట్టర్‌ఫ్లాప్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో ప్రజారంజకంగా ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరత్నాలు ప్రవేశపెట్టి 99 శాతం మ్యానిఫెస్టోను అమలుచేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంతకు మించిన పథకాలతో 2024లో ప్రజల ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పై ఆయనకే నమ్మకం లేదన్నారు. అమ్మఒడి పథకంలో రూ. 15 వేలు ఇస్తుంటే హేళన చేసిన చంద్రబాబు ఇద్దరు పిల్లలకైనా అమ్మఒడి ఇస్తానంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాపట్ల జిల్లా కేంద్రం అభివృద్ధికి రూ. 75 కోట్ల విడుదల, తాగునీటి శాశ్వత పరిష్కారంలో భాగంగా రెండో సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మరో ఐదేళ్ళలో బాపట్లను బంగారు బాపట్లగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, నియోజకవర్గ పరిశీలకురాలు రూత్‌రాణి, చేజర్ల నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గవినికృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు జోగి రాజా, సహకార సంఘం డైరెక్టర్ పీట వెంకటేశ్వర్లు, కొట్రా కొండలు, స్టాన్లీ, అమ్మేశ్వరరావు పాల్గొన్నారు.

35 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్ధం

రాజుపాలెం: మండలంలోని కొండమోడు విద్యుత్ ఏడిఏ కార్యాలయం వెనుక భద్రపరిచిన 35 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధమయ్యాయి. వీటిలో 30 త్రీ ఫేజ్ , 5 సింగిల్,ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఆదివారం కార్యాలయం ప్రక్కన గుర్తు తెలియని వ్యక్తులు పొలంలో ఉన్న ముళ్లకంచెకు నిప్పు పెట్టడంతో భారీ మంటలు చెలరేగి ప్రహరీ గోడకు లోపల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు వ్యాపించాయి. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడం, పేలుళ్లతో స్థానికులు భయాందోళనకు గురి అయ్యారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలికి చేరుకున్నారు. ఎస్‌ఈ మురళీకృష్ణయాదవ్, మాచర్ల ఈఈ హరిబాబు, ఏడీ బాబ్జీనాయక్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దగ్ధమైన ట్రాన్స్‌ఫార్మర్ల విలువ సుమారు రూ 35లక్షలు ఉంటుందని ఎస్‌ఈ తెలిపారు.

వైఎస్సార్ సీపీ విజయానికి అంకురిత దీక్షతో పనిచేయండి

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేశ్



ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేశ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 29వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు

చీరాల: చీరాలలో జరిగిన సంక్షేమాభివృద్ధికి ప్రజలతో పాటు టీడీపీకి చెందిన నాయకులు సైతం మెచ్చుకుంటున్నారని, అందుకు ప్రతిఫలమే ఆ పార్టీనుంచి జోరుగా చేరికలని చీరాల అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేశ్ అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆదివారం

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేతలు..

స్థానిక మునిసిపాలిటీ 29 వార్డులో టీడీపీకి చెందిన అన్నం హనుమంతరావు సహా మరో 25 కుటుంబాలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్ సమక్షంలో వైఎస్సార్ సీపీ గూటికి చేరారు. ఈమేరకు వారిని ఆహ్వానించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కరణం వెంకటేశ్ దిశానిర్దేశం చేశారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యేగా తనతో పాటు, ఎంపీగా నందిగం సురేష్ విజయానికి అకుంఠిత దీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో జాన్‌బాషా, జొన్నాదుల శ్రీనివాసరావు, డొక్కా అశోక్‌కుమార్, కె.వివేక్, మౌలాలీ తదితరులు ఉన్నారు.

ఆర్ ఎంపీ సమాఖ్య సంపూర్ణ మద్దతు

నియోజకవర్గంలోని ప్రథమ చికిత్స వైద్యుల సమాఖ్యకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరణం వెంకటేశ్ హామీ ఇచ్చారు. ఆదివారం రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆర్‌ఎంపీ సమాఖ్య సభ్యులు వెంకటేశ్ ను మర్యాద పూర్వకంగా కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. కరణం వెంకటేశ్ ను కలిసినవారిలో సమాఖ్య సలహాదారు రిచర్డ్ సన్ సాల్మన్, అధ్యక్ష, ఉపాధ్యక్షులు సుధాకర్, లింగేశ్వరరావు, ప్రతినిధులు గుప్తా, నరసింహారావు, జగన్నాథరావు, ఏకాంబరేశ్వరరావు, రామకృష్ణ, శ్రీమన్నారాయణ, రమేశ్ ఉన్నారు.

ముస్లిం కుటుంబాల మద్దతు:

వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేశ్ ను ఎమ్మెల్యేగా గెలిపించి తీరతామని వేటపాలెం రైల్వేస్టేషన్ రోడ్డులోని 35 ముస్లిం కుటుంబాలు హామీ ఇచ్చాయి. ఆదివారం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్ ను మర్యాద పూర్వకంగా కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సీఎం జగనన్న సారథ్యంలో చీరాలను అభివృద్ధి పథంలో నడిపించిన వెంకటేశ్ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

ఉపసంహరించుకునేదేలే..

తేల్చిచెప్పిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి దేవరపల్లి రంగారావు

చీరాల రూరల్: కాంగ్రెస్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచి నామినేషన్ ధాఖలు చేసిన దేవరపల్లి రంగారావు తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకునేదే లేదని తేల్చిచెప్పేశారు. ఆదివారం తన నివాసం వద్ద మద్దతు దారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. తన అభ్యర్థిత్వాన్ని వెనక్కితీసుకోవాలని కొందరు తన వద్దకు వచ్చి బెదిరించారని అటువంటి వాటికి భయపడే వ్యక్తిని కాదన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 218 బూత్ కమిటీలను ఏర్పాటుచేసి ఇన్‌చార్జులను నియమించినట్లు చెప్పారు. మాజీ ఎంపీ జేడీ శీలం తనకు దక్కాల్సిన ఎమ్మెల్యే టికెట్టును వేరొకరికి కేటాయించడం దారుణమని విమర్శించారు. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి అన్నీ తానై నడిపించానని ఇన్‌చార్జ్‌గా ఉన్న తనకు కనీస సమాచారం ఇవ్వకుండా టిక్కెట్‌ను వేరొకకరికి ప్రకటించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అహ్మద్ అలీ, అనిల్, షేక్ బాజి, ఐనంపూడి అఖిల్, షేక్ నాగూర్, శివయ్య, రాజేష్,ఇనగంటి చంటి, తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పరితపిస్తోన్న నాయకుడు సీఎం జగన్



వంకాయలపాడులో ప్రచారం చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

- పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీకి బ్రహ్మరథం పట్టిన ఓటర్లు
- పార్టీని గెలిపిస్తామంటూ హామీ

ఇంకొల్లు (చినగంజాం): పేదల సంక్షేమానికై నిత్యం పరితపిస్తోన్న, పనిచేస్తోన్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం రాత్రి ఇంకొల్లు మండలంలోని సుబ్బారెడ్డి పాలెం, వంకాయలపాడు, పూసపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల ప్రజలనుంచి బాలాజీకి ఘన స్వాగతం లభించింది. వంకాయలపాడులో గ్రామ పజలు ఆయనకు పూలదండ, పూల కిరీటంతో ఘనంగా సత్కరించారు. దళిత వాడ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు వృద్ధులు, మహిళలు ఆయన ప్రచార రథానికి దిష్టి తీసారు. తెల్లవారు జామునే పింఛను ఇంటికి చేరుస్తున్న జగన్ తిరిగి సీఎంగా రావాలని, పర్చూరులో బాలాజీ విజయం సాధించాలంటూ పింఛన్ దారులు ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవరత్నాల ప్లస్ పేరుతో సంక్షేమ పథకాలను మరింత పెంచి పేదలకు మేలు చేసేందుకు సీఎం జగన్ సిద్ధం అయ్యారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, సర్పంచి గద్దల రత్నకుమారి, వంకాయలపాడు మాజీ సర్పంచ్ భవనం రామిరెడ్డి, సురేష్ రెడ్డి, పిడపర్తి రామస్వామిరెడ్డి, అడపా సుధాకరరెడ్డి, పాదిలి రాఘవ, భవనం రామలింగారెడ్డి, యర్రం సుబ్బారెడ్డి, గద్దల మహేశ్, పూసపాడు సర్పంచ్ పావులూరి రమాదేవి, ఎంపీటీసీ కంకట రాంబాబు, యామర్తి శిరోమణి, భవనం సుందర్‌రెడ్డి, చినగంజాం నల్లమోపు సుబ్బారెడ్డి, పాదర్తి ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షేమం సాగాలంటే ఫ్యాన్ కే ఓటెయ్యండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కరణం
- అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కరణం వెంకటేష్



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కరణం

వేటపాలెం: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దీవించాలని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేశ్ ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం రాత్రి చీరాల రూరల్ మండలం కావూరివారిపాలెం, వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే కరణం, వెంకటేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందించారని గుర్తుచేశారు. అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరిగిందని, జరిగిన మంచిని మరచిపోకుండా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కూటమి పేరుతో మూడు పార్టీలు జతకట్టి మీ ముందుకు వస్తున్నాయని, వారి కల్లబొల్లి మాటలు నమ్మిమోసపోవద్దని సూచించారు. జగనన్న విడుదల చేసిన 2024 ఎన్నికల మేనిఫెస్టోలో అమలు చేయగలిగిన పథకాలను మాత్రమే పొందుపరిచారని తెలిపారు. కూటమి సూపర్ సిక్స్ అంతా మోసమేనన్నారు. నవరత్నాల అమలు యథాతథంగా కొనసాతుందని చెప్పారు. మే 13న జరగనున్న పోలింగ్‌లో మీ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా నందిగం సురేశ్ ను గెలిపించాలని కోరుతూ ఇంటింటికి తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, మాజీ ఎంపీ చిమటా సాంబు, ఆర్‌బీకే చైర్మన్ రమణా రెడ్డి, చీరాల మండల పార్టీ అధ్యక్షుడు అంకాల రెడ్డి, గుంటూరు మాదవరావు, మాజీ ఎంపీపీ గవిని శ్రీనివాసరావు, పిట్టు నాగిరెడ్డి, రత్నారెడ్డి, పాల్గొన్నారు.